ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం

తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌ఖాన్

సుభాష్‌నగర్: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేశామని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పరిశీలనను పరిశీలించారు. ఈ సందర్భంగా రెహమాన్ ఖాన్ మాట్లాడుతూ.. గతంలో 20084 దరఖాస్తు పెండింగ్‌లో ఉండగా ఇప్పటికీ 170 దరఖాస్తులను పరిశీలించి ప్రక్షాళన కోసం ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. మిగతా దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్ ముందు బైండోవర్..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో నేర చరిత్ర కలిగిన రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నారు. జగద్గిరిగుట్ట, బాలానగర్, సూరారం పోలీస్‌స్టేషన్లకు చెందిన 6 మంది రౌడీషీటర్లను మంగళవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్ ముందు బైండోవర్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ రాజుకు వినతి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతి పత్రాలు అందజేస్తున్న స్థానికులు

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోకి కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి స్థానిక సమస్యలను ఏకరవు పెట్టారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



వెండిపాదుకల అభిషేకంలో పాల్గొన్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి చేయించిన వెండిపాదుకలకు అభిషేకం, అలంకరణ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

సుభాష్‌నగర్: కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పార్టీ సీనియర్ నేత బైరి భాస్కర్‌గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ.. గతంలో రోహిన్‌రెడ్డితో పార్టీలో కలిసి పని చేశామన్నారు. ఆయనను కలిసిన వారిలో జనార్దన్‌గౌడ్, రామ్‌నాథ్, ప్రసాద్ ఉన్నారు.

బాచుపల్లిలోని ఎర్రకుంట చెరువు సర్వే



బాచుపల్లిలోని ఎర్రకుంట చెరువును సందర్శించిన జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులు

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎర్రకుంట చెరువు సర్వే మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ పలు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డీఐ గంగాధర్ మాట్లాడుతూ.. చెరువు సర్వే అనంతరం హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరిగితే వాటికి మార్కింగ్ చేస్తామని తెలిపారు. మండల సర్వేయర్ సదానంద్, ఆర్‌ఐ కవిత, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజినీర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

బాలికను గర్భవతి చేసిన వ్యక్తి అరెస్టు

జీడిమెట్ల: బాలికను ప్రేమ పేరుతో లొంగదీసుకుని గర్భవతి చేసిన వ్యక్తిపై జీడిమెట్ల పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ రాంరెడ్డినగర్‌కు చెందిన ఐజాక్ నవీన్‌దీప్(38) ప్రైవేట్ ఉద్యోగి. కాగా ఐజాక్ తన సమీపంలో ఉండే ఓ బాలికకు మాయమాటలు చెప్పి ప్రేమించాడు. గతేడాది డిసెంబర్‌లో బాలికను గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లిపోయాడు. బాలిక కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వారు ఇద్దరు బెంగుళూరులో ఉన్నట్లు కనుక్కుని నగరానికి తీసుకువచ్చారు. కాగా బాలికగా ఉన్నప్పుడే గర్భవతి అయ్యిందని తెలిపారు. ఈ మేరకు ఐజాక్‌పై పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



దుండిగల్: అనారోగ్యం కారణంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ చౌరస్తా సమీపంలో బావర్చి హోటల్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం అచేతనంగా పడి ఉన్న అతడిని స్థానికులు గుర్తించి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. స్థానికులు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 35–40 సంవత్సరాల లోపు ఉంటుందన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫౌంటెయిన్స్.. నో మెయింటనెన్స్!



ఫౌంటెయిన్‌లో తుప్పు పట్టిన పైపులు.. రోడ్డు ఊడ్చే చీపురు



పనిచేయని ఫౌంటెయిన్

రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల కార్యాలయంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ప్రతినిత్యం వివిధ పనులపై వచ్చే ప్రజల సౌకర్యార్థం వివిధ రకాల మొక్కలతో పార్కును ఏర్పాటు చేశారు. అదే విధంగా ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించేందుకు పార్కుల్లో మూడు చోట్ల ఫౌంటెయిన్లను నిర్మించారు. అయితే కొద్ది రోజుల పాటు పని చేసిన ఫౌంటెయిన్లు ఆ తరువాత నిర్వహణ లోపించడంతో మూలనపడ్డాయి. ఫౌంటెయిన్‌లోని నీటిని ఎగజిమ్మే పైపులు తుప్పుపట్టడంతో వాటి కనెక్షన్లను నిలుపుదల చేశారు. దీంతో వాటిని పారిశుద్ధ్య సిబ్బంది తమ వస్తు సామగ్రిని ఉంచుకునేందుకు ఉపయోగిస్తున్నారు. సర్కిల్ ఆవరణలోని పార్కు పరిస్థితి ఇలా ఉంటే ఇక కాలనీల్లోని పార్కుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



నీళ్లు లేక ఖాళీగా ఉన్న ఫౌంటెయిన్

పచ్చని నేలపై కాలకూట విషం









పచ్చని నేలపై కాలకూట విషాన్ని విరజిమ్ముతున్నారు. పంచభూతాల్లో ఒకటైన పుడమి తల్లిని రసాయన జలాలతో కలుషితం చేస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు రాబోయే తరాల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒకచోట వ్యర్థ రసాయనాలను డంపింగ్ చేయడం పరిపాటిగా మారింది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఈ తంతు ఎక్కువగా సాగుతోంది. ఇంతా జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దుండిగల్: గాగిల్లాపూర్ తాండా, దుండిగల్–1, 2 తాండాల్లో రాత్రి సమయాల్లో కలుషిత వ్యర్థాల డంపింగ్ జోరుగా సాగుతోంది. విష రసాయనాలను డంపింగ్ చేయడం వల్ల చుట్టూ కొన్ని కిలో మీటర్ల వరకు ఘాటైన వాసనలు వెదజల్లుతున్నాయి. దీంతో చుట్టు పక్కల నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పటికే సమీపంలో ఉన్న పారిశ్రామికవాడల నుంచి వెలువడే వాయువులతో సతమతమవుతున్న తమకు జనావాసాల మధ్య, నిర్మానుష్య ప్రాంతాల్లో డంపింగ్ చేస్తుండటంతో సమస్య మరింత తీవ్రంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

బోర్ల నుంచి రంగునీరు..

యథేచ్ఛగా రసాయనాలను డంపింగ్ చేస్తుండటంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో బోర్లు వేస్తే కలుషిత (రంగు) నీళ్లు వస్తున్నాయి. ఇప్పటికే నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో తాగడానికి నీరు దొరకడం లేదు. భూగర్భ జలాలు సైతం కలుషితం కావడంతో ప్రజలు ఇతర అవసరాలకు సైతం వినియోగించుకోలేకపోతున్నారు.

తండాలే అనువైన ప్రాంతం..

మున్సిపాలిటీ పరిధి ఔటర్ రింగ్ రోడ్డు, మల్లంపేట నుంచి దుండిగల్ వరకు విస్తరించి ఉంది. దీనికి తోడు వందల ఎకరాల ప్రభుత్వ స్థలాలు నిర్మానుష్య ప్రాంతాల్లో ఉన్నాయి. గతంలో ఓఆర్‌ఆర్ పక్కనే రసాయనాలను డంపింగ్ చేస్తున్న కెమికల్ ముఠా ఇప్పుడు తండాలపై దృష్టి సారించాయి. తండాల పక్కనే ఉన్న డంపింగ్‌యార్డులు, ఖాళీ స్థలల్లో రసాయన వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు.

నిబంధనలను తుంగలో తొక్కిన కెమికల్ మాఫియా..

- గతంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా వేసిన పైపులైన్లను ఏర్పాటు చేసేందుకు భారీ గుంతలను తవ్వగా కెమికల్ మాఫియా ఏకంగా 10 నుంచి 15 ట్యాంకర్ల విష రసాయనాలను అందులనే డంపింగ్ చేయడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది.
- దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఎంఎల్‌ఆర్ ఐటీ కళాశాలకు వెళ్లే దారిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద సుమారు 100 డ్రమ్ముల్లో రసాయనాలను డంప్ చేశారు.
- దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న పంట పొలాల్లో రసాయనాలను డంప్ చేయడంతో పంట పొలాలు పూర్తిగా కాలిపోయాయి.
- గాగిల్లాపూర్‌లోని ఓ పరిశ్రమ వెనుక భాగంలో వ్యర్థాలను పారబోయగా నీళ్లు అని సేవించిన ఆ ఆవు తీవ్ర అవస్థతకు గురై గంట పాటు ఇబ్బంది పడి అక్కడికక్కడే మృత్యువాత పడింది.
- దుండిగల్ తాండా చౌరస్తా సమీపంలో రసాయనాలను పారబోశారు. అక్కడే రసాయనాలు కలిసిన గడ్డి మేసిన గేదె మృత్యువాత పడింది. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

పత్తా లేని పీసీబీ...

విషపూరిత వ్యర్థ రసాయనాల డంపింగ్ చేస్తున్న విషయాన్ని స్థానికులు పలుమార్లు పీసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో కేవలం వచ్చి పరిశీలించి వ్యర్థాలను ల్యాబ్‌లకు తీసుకెళ్లి పరిశీలిస్తామని చెప్పారే గాని ఇప్పటి వరకు ఏ ఒక్క పరిశ్రమపై చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై పీసీబీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లి– కొంపల్లి వెళ్లే రోడ్డులో దూలపల్లి వద్ద రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. డ్రైనేజీ, వాటర్ పైపు లైన్లు, విద్యుత్ స్తంభాలు తొలగించకుండా పనులు నత్తనడకన సాగుతున్నాయి. 'రోడ్డు విస్తరణ కొనసాగుతూనే ఉంది' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కొంపల్లి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం రోడ్డు మధ్యలో డ్రైనేజీ నీరు నిలవకుండా రోడ్డు పక్క నుంచి కాలువను తీశారు. కానీ వాటర్ వర్క్స్ ఎలక్ట్రిసిటీ అధికారులు మాత్రం ఈ సమస్యపై ఇంకెప్పుడు స్పందిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..



గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

నిజాంపేట్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్ పోచమ్మ గుడి సమీపంలో తచ్చాడుతున్న ఇద్దరు అప్పన్‌రావు, శ్రీనివాస్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఏమి చేస్తున్నారని ఆరా తీయగా వారి వద్ద రెండు కిలోల గంజాయి ఉన్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహచర కౌన్సిలర్ల సహాయంతో మున్సిపాలిటీలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎండాకాలం సందర్భంగా నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు, ఏఈ ప్రవీణ్, రెవెన్యూ అధికారి సునందా, మేనేజర్ నరసింహులు, టీపీఓ సంజన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివి పాఠశాలకు పేరు తేవాలి

జగద్గిరిగుట్ట: సమాజ సేవ కోసమే తాము పనిచేస్తున్నామని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు తూటి విజయ్‌కుమార్ అన్నారు. జగద్గిరిగుట్ట ఉన్నత పాఠశాలలో సొసైటీ ఆధ్వర్యంలో సింగల్ పేరెంట్స్ కలిగిన 30 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి ఇతరులకు సహాయం చేసేవిధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు వినయ్, రవీందర్‌రెడ్డి, గణిత, సామాజిక వేత మధుబాబు చికిలే, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు రాయి విష్ణుష్ ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, సొసైటీ బాలల విభాగం కన్వీనర్ తూటి సాత్విక, విద్యార్థులు పాల్గొన్నారు.



నిబంధనలు పాటిస్తూ ప్రార్థనలు చేసుకోవాలి



పీస్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్

కుత్బుల్లాపూర్: రంజాన్ మాసం ప్రారంభం నేపథ్యంలో మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ పీస్ మీటింగ్‌ను నిర్వహించారు. నెల రోజుల పాటు కొనసాగే రంజాన్ మాసం నేపథ్యంలో మసీదుల వద్ద నిబంధనలు పాటిస్తూ ప్రార్థనలు నిర్వహించుకోవాలన్నారు. ఈ మాసంలోనే రంజాన్, హోలీ, గుడ్‌ఫ్రైడేలతో పాటు ఎన్నికల కోడ్ వచ్చే అవకాశమున్న నేపథ్యంలో శాంతియుత వాతావరణంలో రంజాన్ మాసం పూర్తయ్యేందుకు సహకరించాలని సూచించారు.

శాంతియుత వాతావరణంలో పండగలను జరుపుకోవాలి



పీస్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్: సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో రంజాన్, హోలీ, ఉగాది, గుడ్‌ఫ్రైడేల సందర్భంగా మంగళవారం శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒకే మాసంలో ఇతర మతస్తుల పండగలు వచ్చాయన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో ఎన్నికల కోడ్ కూడా రాబోతోందని ఆ విషయం దృష్టిలో ఉంచుకొని ర్యాలీలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న పార్టీలను ఓడించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ లోగోను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ దేశాన్ని పాలిస్తూ వస్తున్న కాంగ్రెస్, బీజేపీ ఈ దేశ జనాభాలో సగానికి పైగా బీసీల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఎన్నికల్లో బ్లూ ఇండియా పార్టీ ద్వారా మాత్రమే సామాజిక న్యాయం దక్కుతుందని ఆ దిశగా బీసీలు చైతన్యవంతం కావాలన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి భూపాల్, కోశాధికారి భోంపల్లి మధు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

కాలనీ నుంచి బాయ్స్ హాస్టల్‌ను తరలించాలి



నిరసన ర్యాలీ చేపట్టిన విష్ణుప్రియా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: నివాసిత ప్రాంతాల్లో కొనసాగుతున్న బాయ్స్ హాస్టల్‌ను తరలించాలని మంగళవారం గాజులరామారం డివిజన్ విష్ణుప్రియ ఎన్‌క్లేవ్ రెడిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరసన దిగింది. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ హరికృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ... అనుమతి లేకుండా స్థానికంగా ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో బాయ్స్ హాస్టల్‌ను నడుపుతున్నారని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్‌కు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతూ రాకపోకలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు. నివాసిత ప్రాంతాల్లో కొనసాగుతున్న హాస్టల్‌పై చర్యలు తీసుకుని కాలనీలో శాంతియుత వాతావరణాన్ని పరిరక్షించాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నవీన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్ట్.. ప్రాజెక్ట్స్ బెస్ట్





సాక్షి,సిటీబ్యూరో: మగ్దూమ్‌నగర్‌లోని నాగార్జున హైస్కూల్ మంగళవారం సైన్స్ ఫెస్ట్ జరిగింది. ఈ ఫెస్ట్‌లో సుమారు 300మంది విద్యార్థులు పాల్గొని 220నమూనాల(ప్రాజెక్టుల)ను ప్రదర్శించారు. ఎంతో సృజనాత్మకతతో అతిథులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆశ్చర్యపోయేలా కొత్త కొత్త నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓయూ రిటైర్డ్ ప్రొ. బీఎస్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక ట్రెజరర్ వరప్రసాద్, ప్రిన్సిపాల్ కిషన్‌రావు విద్యార్థులను అభినందించారు.



